నరసాపురంలో పారిశుద్ధ్య సమస్యలు

- రోగాల పాలవుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు


కనకదుర్గ టెంపుల్ వీధిలో సిల్ట్ తీయకపోవడంతో పొంగుతున్న డ్రెయిన్


గోదావరిగట్టు మాధవాయిపాలెం వద్ద ఇళ్ల మధ్య దుస్థితి

నరసాపురం: పట్టణంలో పారిశుద్ధ్యం దారుణంగా క్షీణిస్తోంది. పట్టణంలో ఎక్కడ చూసినా చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. పట్టించుకోవాల్సిన పురపాలక సంఘ నాయకులు, అధికారులు నిర్లక్ష్యం చూపిస్తున్నారు. దీంతో పట్టణ వాసులు అనేక అవస్థలు పడుతున్నారు. రోగాల బారిన పడి ఆసుపత్రుల పాలవుతున్నారు. పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణకు సంబంధించి, మొదటి నుంచీ ఇబ్బందులు ఉన్నాయి. అయితే పరిస్థితిని సరిచేసే ప్రయత్నం మాత్రం చేయడం లేదు. మొత్తం పట్టణంలో 60 వేలు జనాభా ఉంది. 31 వార్డులతో పట్టణం విస్తరించి ఉంది. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ అంతా అంతా కలిపి 150 మంది పారిశుద్ధ్య నిర్వహణలో పని చేస్తున్నారు. అయితే కొన్ని నెలల నుంచి చెత్తసేకరణ నుంచి, డ్రెయిన్స్ శుభ్రం చేయడం వరకూ ఏ పనులూ సవ్యంగా సాగడంలేదు. దీంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రుస్తుంబాధ, రాయిపేట, వైఎస్సార్ నగర్, నందమూరికాలనీ, ఎన్టీఆర్ కాలనీ ప్రాంతాల్లో పారిశుద్ధ్య సమస్యలు ఎక్కువగా ఉన్నాయి. కీలకమైన మార్కెట్ ప్రాంతం, స్టీమర్‌రోడ్డు, కోర్టువీధి, ప్రకాశం రోడ్డు ప్రాంతాల్లో కూడా పొంగుతున్న డ్రెయిన్లు, రోడ్డు పక్క చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి.

పెరిగిన పందుల బెడద...

పట్టణంలో ఇటీవల పందుల బెడద పెరిగింది. ఎక్కడపడితే అక్కడ పందులు విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. పందుల నిర్మూలనకు చర్యలు చేపడతామని మున్సిపల్ పాలకులు, అధికారులు ఎప్పటి నుంచో చెబుతున్నా పని మాత్రం జరగడం లేదు. ఇక శానిటేషన్ శాఖ పనితీరుపై కూడా విమర్శలు వస్తున్నాయి. పట్టణంలో రెండు శానిటరీ డివిజన్లు ఉన్నాయి. ఒక్క శానిటరీ ఇన్‌స్పెక్టర్ మాత్రమే మొత్తం పర్యవేక్షణ చేస్తున్నారు. ఈ పరిస్థితిని చక్కబెట్టే ప్రయత్నం ఏమీ చేయడం లేదు. రోడ్డు పక్క పిచ్చిమొక్కలు కూడా విపరీతంగా పెరిగిపోయాయి. కనీసం రోడ్డుపక్క పిచ్చి మొక్కలను తొలగించడం లేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. అపారిశుద్ధ్యంతో దోమలు విపరీతంగా పెరిగిపోయి పట్టణ వాసులు రోగాల బారిన పడుతున్నారు. ఇక డ్రెయిన్ల పరిస్థితి అయితే మరింత అధ్వానంగా తయారయ్యింది. అన్ని వార్డుల్లో డ్రెయిన్లు పొంగి పొర్లుతున్నాయి. డ్రెయిన్లను శుభ్రం చేసే పనులు చేపట్టడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పట్టణంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పారిశుద్ధ్య నిర్వహణ బాగోలేదు



పట్టణంలో పారిశుద్ధ్య అధ్వానంగా ఉంది. మున్సిపల్ అధికారులు పారిశుద్ధ్య నిర్వహణను అసలు పట్టించుకోవడంలేదు. డ్రెయిన్లలో సిల్ట్ సవ్యంగా తీయడం లేదు. ఇళ్ల మధ్య డ్రెయిన్లు పొంగుతున్నాయి. ఎంఎల్ ఆయిల్ చల్లడం, ఫాగింగ్ చేయడం లాంటి పనులు నిలిచిపోయారు. దీంతో విష జ్వరాలతో జనం బాధపడుతున్నారు. ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు.

–మల్లాడి బుజ్జి, నరసాపురం

ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టాలి



మున్సిపాలిటీలో అన్ని వార్డుల్లో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టాలి. అవసరమైన సిబ్బందిని నియమించాలి. పట్టణంలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. మెయిన్ బజార్ సెంటర్‌లో కూడా చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో? అర్థం అవుతుంది.

– అడిదల శరత్, స్టేషన్‌పేట, నరసాపురం

క్లుప్తంగా

ముగిసిన పెద్దింట్లమ్మ ఆలయ వార్షికోత్సవాలు


పెనుగొండ అడ్డపుంతలో పెద్దింట్లమ్మ

పెనుగొండ: పెనుగొండ అడ్డపుంతలో పెద్దింట్లమ్మ ఆలయ పదో వార్షికోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఈ ఉత్సవాలు ఈ నెల 11న ప్రారంభమయ్యాయి. ఆఖరి రోజు సందర్భంగా ఆదివారం ఉదయం నుంచి పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం భారీ అన్న సమారాధన నిర్వహించారు. పెనుగొండ పరిసర ప్రాంతాలకు చెందిన వేలాది మంది అన్న సమారాధనలో పాల్గొన్నారు.

జుత్తిగలో అఖండ అన్నసమారాధన


అఖండ అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

పెనుమంట్ర: జుత్తిగ గ్రామంలో ఉన్న శ్రీ జుత్తిగ అమ్మవారి ఆలయ రెండో పునః ప్రతిష్ఠా వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం అమ్మవారికి కుంకుమార్చనలు, గ్రామోత్సవం, నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అఖండ అన్నసమారాధన నిర్వహించారు. పురాతన దేవాలయమైన ఈ ఆలయాన్ని రెండేళ్ల క్రితం దాతల సహకారంతో రూ. 35 లక్షల వ్యయంతో పునర్నిర్మించి రెండేళ్ల క్రితం నూతన విగ్రహ ప్రతిష్ఠ చేశామని గ్రామ సర్పంచ్, ఆలయ కమిటీ సభ్యుడు తమనంపూడి వీర్రెడ్డి తెలిపారు.

వెంకటేశ్వరరావుకు పరామర్శ


మామిడిశెట్టి వెంకటేశ్వరరావును పరామర్శిస్తున్న గుడాల శ్రీహరి గోపాలరావు

యలమంచిలి: వైఎస్సార్ సీపీ నాయకుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం యలమంచిలి మండల యువజన విభాగం మాజీ అధ్యక్షుడు మామిడి శెట్టి చిట్టిబాబు తండ్రి మామిడిశెట్టి వెంకటేశ్వరరావుకు ఇటీవల గుండెపోటు రావడంతో స్టంట్ వేయించుకున్నారు. ఆయన కోలుకుని ఆసుపత్రి నుంచి ఇంటికి రావడంతో వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) ఆదివారం వడ్డిలంక వెళ్లి వెంకటేశ్వరరావును పరామర్శించారు. పార్టీకి ఆ కుటుంబ సభ్యులు చేసిన సేవలు గుర్తు చేసుకున్నారు. పరామర్శించిన వారిలో గ్రామ సర్పంచ్ పొన్నమండ నాగరాజు, ఉప సర్పంచ్ పెచ్చెట్టి రాంబాబు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్రా జయ సరిత, నాయకులు జోగాడ ఉమామహేశ్వర రావు, జోగి వెంకటేశ్వరరావు, కెల్లా పెద్దిరాజు, దేవ రాజేష్, పసుపులేటి కుమారి, కుసుమ హేమ లత, జ్యోతి తదితరులు ఉన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

నరసాపురం: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ (మీకోసం) కార్యక్రమం యథావిధిగా నిర్వహిస్తున్నట్టు నరసాపురం ఆర్డీఓ దాసి రాజు చెప్పారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డివిజన్‌లోని అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని వివరించారు. ప్రజలు తమ ఫిర్యాదులు, దరఖాస్తులు ఉదయం 10.30 గంటలు నుంచి అందించాలని చెప్పారు.

స్వర్ణాంధ్రలో పాలిటెక్నిక్ ఉచిత శిక్షణ


వివరాలు వెల్లడిస్తున్న స్వర్ణాంధ్ర యాజమాన్య సభ్యులు

నరసాపురం రూరల్: మండలంలోని స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో ఈ ఏడాది కూడా పాలిసెట్ కు హాజరయ్యే విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కళాశాల యాజమాన్యం తెలిపింది. ఆదివారం సీతారామపురం స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో వారు విలేకరులతో మాట్లాడారు. పదో తరగతి పరీక్షలు రేసే విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 2 నుంచి 29 వరకు కళాశాలలో విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వడంతో పాటు, ఉచిత స్టడీమెటీరియల్‌తో పాటు రవాణా సౌకర్యం కూడా కల్పిస్తున్నామన్నారు. పాలిసెట్ ఎంట్రన్స్ పరీక్షలో మంచి ర్యాంకులు సాధించి డిప్లమో పూర్తి చేస్తే త్వరితగతిన ఉద్యోగావకాశాలు పొందవచ్చునన్నారు. సమావేశంలో స్వర్ణాంధ్ర కళాశాల చైర్మన్ కొండవీటి సత్యనారాయణ, ట్రెజరర్ కేవీ స్వామి, పాలకవర్గ సభ్యులు అడ్డాల శ్రీహరి, కళాశాల ప్రిన్సిపాల్స్ సురేష్‌కుమార్, పండరీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

పెనుగొండ: మండలంలోని కోడేరు అక్రమంగా బెల్ట్ షాపు నిర్వహిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని, ఏడు మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొన్నట్లు పాలకొల్లు ఎక్సైజ్ శాఖ సిఐ మద్దాల శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం ఆచంట మండలంలో పాలు ప్రాంతాల్లో దాడులు నిర్వహించామని పేర్కొన్నారు. కోడేరులో బి.సుబ్బారావు బెల్ట్ షాపు నిర్వహిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. దాడుల్లో ఎస్ఐ రఘు, సిబ్బంది పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ

పెనుగొండ: కల్వరి గ్రాస్పెల్ హీలింగ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కొడమంచిలి అరుదతీ పేటలో వికలాంగులకు, వితంతువులకు, వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. ఆదివారం ట్రస్ట్ అధ్యక్షుడు చదలవాడ చంద్రశేఖర్ రాజు(పాల్) ఆధ్వర్యంలో సుమారు 20 మందికి వీటిని అందించారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు శాంతి పాల్, జోసెఫ్ కిషోర్, షెబరాణి, విత్తనాల తిమోతి, దిర్సిపో ప్రసాద్, బద్దిరెడ్డి డేనియల్ తదితరులు పాల్గొన్నారు.

రామేశ్వరుని సేవలో మంత్రి ఆనం

పెనుగొండ: రాష్ట్ర ధర్మాదాయ దేవదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రాంనారాయణ రెడ్డి ఆదివారం ఆచంటలోని రామేశ్వర స్వామిని దర్శించుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ స్వాగతం పలికారు. దేవాదాయ శాఖాధికారులు సాంప్రదాయ పద్ధతిలో స్వాగతం పలికి వేద ఆశీర్వచనం అందించారు. రామేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.జెడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్ బాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో మౌలిక వసతులు కల్పించాలి


జగనన్న కాలనీ వాసులతో మాట్లాడుతున్న ముచ్చర్ల త్రిమూర్తులు

నరసాపురం రూరల్: జగనన్న కాలనీలో మంచినీరు, రోడ్లు, డ్రెయినేజీ, విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని సీపీఎం పార్టీ పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక మంగళగుంటపాలెంలో ప్రభుత్వం ఇళ్ల స్థలాలకు కేటాయించిన స్థలంలో పది ఎకరాలను పూడిక చేసి 630 ఇళ్ల నిర్మాణాలు చేపట్టిందన్నారు. ఈ స్థలాలలో సుమారు 50 కుటుంబాలు గృహాలను పూర్తి స్థాయిలో నిర్మాణం చేసుకుని నివాసం ఉంటున్నారని, కానీ ఆ కుటుంబాలకు తాగడానికి మంచినీళ్ల సదుపాయం లేక సుదీర్ఘ ప్రాంతాల నుండీ నీరు తెచ్చుకునే దుస్థితి నెలకొందని తెలిపారు. వర్షాకాలం వస్తే రోడ్లు బాడిబంద, బురదతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటారని తెలిపారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి జగనన్న కాలనీలో మౌళిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు మంచిలి నీలకంఠం, నోముల కొండ, బూడిద జోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆటోలను నియంత్రించేది ఎవరు?


మొగల్తూరురోడ్డులో ఇష్టానుసారం నిలిపి ఉంచిన ఆటోలు

నరసాపురం: పట్టణంలో ఆటోల సమస్య నానాటికీ తీవ్ర మవుతోంది. ఆటోలను ఇష్టానుసారం రోడ్ల మీదే నిలిపి ఉంచడంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. మితిమీరిన వేగంతో ఆటోలను తిప్పడం, కనీస వయస్సులేని పిల్లలు సైతం ఆటో డ్రైవర్ల అవతారం ఎత్తడంతో ప్రతి రోజూ ఆటోల కారణంగా ఏవో ప్రమాదాలు జరగడం పరిపాటిగా మారింది. పట్టణంలో దాదాపు 400 పైగా ఆటోలున్నాయి. అయితే ఆటోలను నిలిపి ఉంచడానికి ప్రత్యేకంగా ఎక్కడా స్టాండ్స్ లేకపోవడం ఇబ్బందులను తెచ్చి పెడుతుంది. ఆటో డ్రైవర్లు ఎక్కడ పడితే అక్కడ ఆటోలను నిలిపి ఉంచడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా బస్టాండ్, గుర్రపు బళ్ల స్టాండ్, ఎండుచేపల మార్కెట్ ప్రాంతాల్లో ఆటోల సమస్య ఎక్కువగా ఉంది. ఈ ప్రాంతాల్లో వందల కొద్దీ ఆటోలను రోడ్ల మీదే నిలిపి ఉంచుతున్నారు. రద్దీగా ఉండే బస్టాండ్, గుర్రపు బళ్ల స్టాండ్ వద్ద ఆటోలు కారణంగా ప్రమాదాలు ఎక్కువవుతున్నాయి. గడిచిన రెండేళ్లలో పట్టణంలో జరిగిన రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా ఈ రెండు ప్రాంతాల్లోనే జరగడం విశేషం. అసలే ఇరుగ్గా ఉండే ఈ ప్రాంతాలు ఆటోలు ఇష్టానుసారం నిలిపి ఉంచడంతో పరిస్థితి మరింత ప్రమాదంగా మారింది. ఇదిలా ఉంటే ఆటోలను మితిమీరిన వేగంతో తిప్పడం, పరిమితికి మించి జనాన్ని ఎక్కించుకోవడం సాధారణంగా మారిపోయింది. ఇప్పటికైనా పోలీస్ శాఖ దృష్టి పెట్టి సమస్యను పరిష్కరించాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి


పెనుగొండ: అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

నరసాపురం: భాషాప్రయుక్త రాష్ట్రంకోసం, ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు జీవితం ఆదర్శనీయమని బీజీబీఎస్ మహిళా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్, వాసవీక్లబ్ అధ్యక్షుడు నూలి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం క్లబ్ ఆధ్వర్యంలో పొట్టిశ్రీరాములు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో రెండుచోట్ల వేసవి చలివేంద్రాలను ప్రారంభించారు. అనంతరం పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు కె.బాబ్జి, కె.బాలకృష్ణ, అప్పన బదిరీ తదితరులు పాల్గొన్నారు.

నరసాపురం మండలంలో..

నరసాపురం రూరల్: ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ప్రాణాలర్పించిన అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. తూర్పుతాళ్లు గ్రామ సచివాలయ ఆవరణలో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాలర్పించారు. కార్యక్రమంలో వాసవిక్లబ్ అధ్యక్ష కార్యదర్శులు, కంచర్ల సోని, శిరం శ్రీను, రీజియన్ సెక్రటరీ వంకాయల వెంకట రవికుమార్ పాల్గొన్నారు.

పాలకొల్లులో..

పాలకొల్లు సెంట్రల్: స్థానిక శ్రీ వాసవి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బంగారు వారి శ్రీ వాసవి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆదివారం పట్టణంలో తహసీల్దార్ కార్యాలయం, గాంధీబొమ్మల సెంటర్, మన్యం జగ్గమ్మ సత్రం ప్రాంతాల్లో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు మామిడి వెంకటేశ్వరరావు (బాబు), మురహరి ఈశ్వరరావు, మాటూరి నరసింహమూర్తి, సలాది జనార్ధనరావు, బంగారు బుజ్జి, నాళం బాబి పాల్గొన్నారు.

పెనుగొండలో..

పెనుగొండ: అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని పెనుగొండలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం గాంధీబొమ్మల సెంటర్‌లో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వాసవీ క్లబ్, ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.


నరసాపురం రూరల్: తూర్పుతాళ్లులో శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



పాలకొల్లు సెంట్రల్: పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఆర్యవైశ్య సంఘ సభ్యులు


నరసాపురం: చలివేంద్రం ప్రారంభిస్తున్న వాసవీక్లబ్ ప్రతినిధులు

21 నుంచి ఐఎల్‌టీసీలో హ్యాండీక్రాఫ్ట్స్ ఎక్స్‌పో



సమావేశంలో మాట్లాడుతున్న ఐఎల్‌టీసీ కన్వీనర్ నాగ తులసీరావు

నరసాపురం రూరల్: మండలంలోని రుస్తుంబాద గ్రామంలోని అంతర్జాతీయ లేసు ట్రేడ్ సెంటర్ (ఐఎల్‌టీసీ)లో హ్యాండీక్రాఫ్ట్స్ ఎక్స్‌పో ఐదు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఐఎల్‌టీసీ కన్వీనర్ కలవకొలను నాగ తులసీరావు తెలిపారు. ఆదివారం ఈ సెంటర్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 21 నుంచి 25వ తేదీ వరకూ ఈ కార్యక్రమం ఉంటుందని స్పష్టం చేశారు. ఈ ఎక్స్‌పోలో భారతదేశంలో ప్రసిద్ధి చెందిన చేతిఉత్పత్తుల కళాఖండాలు, ఫ్యాషన్ జ్యూయలరీ, గృహోపకరణాలు, లేసుఉత్పత్తులు, కలంకరీ శారీస్, ఫ్యాషన్ హ్యాండ్‌బ్యాగ్స్, రెడీమేడ్ వస్త్రాలు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రత్యేక ఆకర్షణగా ఫుడ్‌కోర్టులు, సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశామన్నారు. పిల్లలు ఆడుకునేందుకు ప్లేజోన్ ఉచితంగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. షాపింగ్ ప్రియులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ప్రవేశం ఉచితం అన్నారు. ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ ఫర్ హ్యాండీక్రాఫ్ట్స్ (ఈపీసీహెచ్) ఆధ్వర్యంలో ఈ ఎక్స్‌పో నిర్వహిస్తున్నామని తులసీరావు తెలిపారు. ఈ సమావేశంలో ఈపీసీహెచ్ డిప్యూటీ డైరెక్టర్ రాజేష్ సింగ్, లేసు ఎగుమతిదారులు కలవకొలను తాతాజీ, అడ్డగళ్ల బాబు, కె.రాజీవ్, కె.సాంబమూర్తి, టి.నటేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నిర్మూలించాలి



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న పర్యావరణ ప్రేమికులు

ఉండి: ప్లాస్టిక్ వాడకాన్ని నిర్మూలించకపోతే ప్రాణాలకు హాని కలుగుతుందని పర్యావరణ ప్రేమికులు ప్రజలకు అవగాహన కల్పించారు. ఆదివారం ఉండిలో నల్లా విజయలక్ష్మీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పర్యావరణ ప్రేమికులు ప్రజలు స్వచ్ఛందంగా ప్లాస్టిక్‌ను నిషేధించాలని ర్యాలీ, మానవహారాన్ని నిర్వహించారు. అనంతరం బస్టాండ్ ఎదురుగా ఉన్న శ్రీరామ క్షేత్రంలో ప్లాస్టిక్ నిషేధంపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం విచ్చలవిడిగా పెరిగిపోయిందన్నారు. వాడి పారేసిన ప్లాస్టిక్ కవర్లు మట్టిలో కలవకపోవడంతో పర్యావరణం ప్రమాదంలో పడుతుందన్నారు. ప్లాస్టిక్ వాడకం వలన అనేక మంది క్యాన్సర్ బారిన పడుతున్నారన్నారు. అనంతరం పాల్గొన్న వారికి చేతిసంచులను అందజేశారు. కార్యక్రమంలో గుండాబత్తుల సుబ్బారావు, నల్లా ప్రసాద్, ఖండావు శ్రీనివాసరావు, దాసరి వరదయ్య, ముదునూరి శివరామరాజు, ఆచారి మాస్టారు, మార్లెళ్ల కామేశ్వరి, అళగిరి సత్యానంద్, మాసాబత్తుల రామకృష్ణ, కాగిత మాతయ్య, తదితరులు పాల్గొన్నారు.

అడవిపాలెంలో కనకదుర్గమ్మ ఉత్సవాలు ప్రారంభం

యలమంచిలి: మండలంలోని అడవిపాలెం గ్రామ దేవత శ్రీ కనకదుర్గ అమ్మవారిని ఆదివారం పుట్టింటికి తీసుకురావడంతో గ్రామంలో ఉగాది ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. పుట్టింటి వంశపారంపర్య ధర్మకర్తలు పొట్టుపోతు నాగ లక్ష్మణ శ్రీనివాసరావు, వెంకట నాగమణి దంపతులు కనకదుర్గమ్మకు సారి, చీర, పానకం కావిడ సమర్పించి అమ్మవారిని తీసుకువచ్చారు. ముందుగా కొంతేరు గ్రామంలో ఉన్న క్షేత్రపాలకుడు శ్రీ కుంతీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పూజ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజాది కార్యక్రమాలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అనంతరం అమ్మవారికి హారతి ఇచ్చి గ్రామోత్సవం నిర్వహించారు. ఉత్సవాలలో భాగంగా ఈ నెల 28న శుక్రవారం ఉదయం ఆలయంలో సామూహిక కుంకుమార్చన అమృతాభిషేకం నిర్వహిస్తారు. 29న శనివారం గమనల గుడుపు 30న ఆదివారం ఉగాది రోజు వర్ధినీడి సత్యనారాయణ (బాబ్జి) నాగమణి దంపతులచే పుట్టింటి కావిడి సమర్పించి గ్రామానికి తూర్పు వైపున జాతర నిర్వహిస్తారు.

పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం


విద్యార్థులకు రూం నంబర్లు కేటాయిస్తున్న ఇన్విజిలేటర్లు


చెరుకువాడలో చదువుకుంటున్న విద్యార్థులు

పెనుగొండ: సోమవారం నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు విద్యాశాఖాధికారులు సర్వం సిద్ధం చేశారు. సోమవారం నుంచి ఈ నెల 31 వరకూ పరీక్షలు కొనసాగుతాయి. పరీక్షలు నిర్వహణకు విద్యాశాఖాధికారులు ఆదివారం పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లు చేశారు. ఆయా కేంద్రాల్లో విద్యార్థుల సంఖ్యకు ఆధారంగా రూమ్‌లు కేటాయిండం, ఇతర ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆచం మండలంలో ఆచంట, వల్లూరు, కొడమంచిలి, ఆచంట వేమవరంల్లోని జిల్లా పరిషత్‌ఉన్నత పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆచంట ఎంవీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 115 మంది, వల్లూరు ఎంపీపాలెం జడ్పీ పాఠశాలలో 81 మంది, ఆచంట వేమవరం ఉన్నత పాఠశాలలో 108 మంది, కొడమంచిలిలో 214 మంది పరీక్షలు వ్రాయనున్నారు. పెనుగొండ మండలం ఇలపర్రులో 62 మంది, దేవలో 71 మంది, చెరుకువాడలో 77 మంది, సిద్ధాంతంలో 159 మంది, పెనుగొండ గరల్స్ పాఠశాలలో 129 మంది పరీక్షలు వ్రాయనున్నారు. వీరితో పాటు ప్రైవేటు కేంద్రాల్లో 467 మంది పరీక్షలకు హాజరవుతారు. పెనుమంట్రమండలంలో పాలమూరులో 72 మంది, మార్టేరు ఎస్వీజీలో 199 మంది, బీడీ జడ్పీలో 68 మంది, పెనుమంట్రలో 169 మంది పరీక్షలు వ్రాయనున్నారు.

నూరు శాతం లక్ష్యంగా...

నూరు శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా 100 రోజుల ముందు నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించారు. ప్రత్యేక ప్రణాళిక రూపొందించి వాటి కనుగుణంగా తరగతులు నిర్వహించారు. వెనుకబడిన విద్యార్థులను సబ్జెక్టులు వారీగా విడదీసి శిక్షణనిచ్చారు.